


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 282 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 18 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 282 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 18 AUGUST 2026 PRICE : 1/- RS


Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు..

## దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి

### వైసీపీకి చంద్రబాబు సవాల్

- మెగా డీఎస్సీ నియామకాల్లో అంతా పారదర్శకమేనన్న సీఎం చంద్రబాబు
- అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం
- డీఎస్సీపై వైసీపీది హిట్ అండ్ రన్ తరహా దుష్ప్రచారం అంటూ ఫైర్
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ప్రతిపక్షానికి సవాల్
- 148 రోజుల్లో 15,941 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని వెల్లడి
- అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నది కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

**విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది**

విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు.

2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై దబ్బాలు కొట్టుకున్నారని

- మిగతా 2లో



## నాగబాబుకు కీలక పదవి..

### కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

- ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబు నియామకం
- రాష్ట్రంలో పచ్చదనాన్ని విశేషంగా పెంచడమే ఈ కమిటీ లక్ష్యం
- పర్యావరణ సమతుల్యత, అడవుల విస్తరణే ప్రధాన లక్ష్యం

- మిగతా 2లో



## అది నేరమా?..

### టీచర్ల సస్పెన్షన్‌పై వైఎస్ జగన్ ఫైర్!

- టెట్ నుంచి మినహాయింపు కోరిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు
- సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటామని హామీ

**పెన్ పవర్ డెస్క్:**ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. "మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎంపీల సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం

- మిగతా 2లో



## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం

- డీఎస్సీ అంశంపై శాసనమండలిలో వైసీపీ రచ్చ
- నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్న బొత్స సత్యనారాయణ
- నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మెగా డీఎస్సీ వివాదంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన టీచర్ నియామక ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష వైసీపీ తీవ్ర

- మిగతా 2లో

## డిగ్రీ పూర్తి కాగానే క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం

### అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్

- మహిళా క్రికెటర్ శ్రీ చరణికి డిగ్రీ కాగానే ఉద్యోగం ఇస్తామని అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన
- క్రీడలను ప్రోత్సహించడంపై ప్రజా ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉందని వెల్లడి
- పీవీ సింధు, జ్యోతి యర్రాజికి ఉద్యోగాలు ఇచ్చింది తామేనని గుర్తు చేసిన మంత్రి
- స్పోర్ట్స్ కోటా భర్తీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఆరోపణలు నిరాధారమని ఖండన

**పెన్ పవర్ డెస్క్:**భారత మహిళా క్రికెట్ జట్టులో అద్భుతమైన బౌలర్‌గా రాణిస్తున్న తెలుగు తేజం శ్రీ చరణికి త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఆమె డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు.

- మిగతా 2లో





## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

- ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా
- స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా
- 14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్

**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు

- మిగతా 2లో

## మా నడిమిట్లకొస్తే ఒమన్‌పై బాంబేస్తాం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్




**పెన్ పవర్ డెస్క్:**రాన్‌తో అమెరికాకు ఉన్న ఘర్షణ వాతావరణంలో మిడిల్ ఈస్ట్ దేశమైన ఒమన్ అడ్డు వస్తే ఆ దేశాన్ని నాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం హెచ్చరించారు. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ గడువుకు కొన్ని రోజుల ముందు.. ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ హెచ్చరిక ప్రకటన చేశారు. "ఒమన్ అడ్డుపడితే, వాళ్ళను బాంబులతో నాశనం చేస్తాం," అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా హాట్ టాపిక్?గా మారాయి. గత కొన్ని వారాలుగా, హోర్ముజ్ జలసంధి నుంచి నౌకా రవాణా నిర్వహణకు సంబంధించిన తాత్కాలిక ఏర్పాటు కోసం ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరాన్ దౌత్యవేత్తలు ఒమన్ అధికారులతో చర్చలు జరుపుతున్న సంగతి తెలిసిందే. మిడిల్ ఈస్ట్ వార్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాలలో ఒకటిగా మారిన హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ

- మిగతా 2లో

## యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

- యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి
- ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ తీర్పులు
- న్యాయవాది హత్య, దోపిడీ వంటి 10 తీవ్రమైన కేసుల్లో ఈ శిక్షలు ఖరారు

- మిగతా 2లో



## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే.. జీతంలో 20శాతం కోత



**పెన్ పవర్ డెస్క్:**బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి

- మిగతా 2లో



## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు..

### తెలంగాణకు నో ప్లేస్!

- బీజేపీ కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించిన నితిన్ నబిన్
- ఏపీ నుంచి ముగ్గురికి కీలక పదవులు
- పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్ష పదవులు
- విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యత
- స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి

**పెన్ పవర్ డెస్క్:**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీ య కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి,

- మిగతా 2లో




# జగన్ కూటమిపై మానసికంగా గెలిచినట్లేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు జనం పోటెత్తుతున్నారు. ఒకరకంగా ఇది కేవలం తన పార్టీలో మానసిక స్థైర్యాన్ని ధైర్యాన్ని నింపడమే కాదు..ప్రత్యర్థులను కూడా ఆలోచనలో పడేస్తున్నాయి. కూటమిలోని అన్ని పార్టీలు జగన్ పర్యటనలకు వచ్చే జనసందోహాన్ని చూసి బయటకు విమర్శలు చేస్తున్నప్పటికీ లోలోపల మాత్రం వైసీపీ కొంత పుంజుకుందన్న అభిప్రాయం వినిపిస్తుంది. ఎంత అంటే ఇప్పుడే చెప్పలేం కానీ ఆయన తన ఓటు బ్యాంకును మరింత బలపర్చుకునే రీతిలోనే జగన్ పర్యటలను కొనసాగిస్తున్నారని ఖచ్చితంగా ప్రత్యర్థులు కూడా అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా జాగ్రత్తలు పడుతున్నారు. ఎవరికి వారే తమ నియోజకవర్గాల్లోనూ, కూటమి పార్టీల అధినేతల ఆలోచనల్లోనూ ఇదే రకమైన అభిప్రాయం ఉంది. కానీ దానిని ఎవరూ బయటకు చెప్పుకోలేరు. అలాగని కొట్టిపారేయలేని పరిస్థితి.

### అసంతృప్తి ఉందని ...

కొంత అధికార పార్టీపైన, ప్రభుత్వంపైన, స్థానిక ఎమ్మెల్యేలల పైనా ప్రజల్లో అసంతృప్తి ఉందని జగన్ పర్యటనలను చూస్తుంటే తెలుస్తుందని అధికార పార్టీ నేతలే అంటున్నారంటే జగన్ కొంత వరకూ ప్రత్యర్థులను మానసికంగా గెలవడంలో సక్సెస్ అయినట్లే. ఇక ఆయన తీసుకోవాల్సిన ముఖ్య జాగ్రత్తలు ఎలక్షనీరింగ్. మళ్లీ తన బొమ్మతోనే గెలుస్తామనుకుంటే వీలు కాదు. ఎందుకంటే కూటమి విడిపోయే అవకాశాలు లేవు. కలసి ఉన్నంత వరకూ జగన్ అధికారంలోకి రావడం కష్టమే. కూటమి కలసి ఉన్నా పవర్ లోకి రావాలంటే అందరికీ ఆలోచనల్లో భాగస్వామ్యం కల్పించాలి. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద తన బలగాన్ని ధైర్యంగా మోహరించగలగాలి. అవి జరగకుంటే 2024 ఎన్నికల ఫలితాలు తిరిగి రిపీట్ అవ్వవన్న గ్యారంటీ లేదు. అందుకే జగన్ పర్యటనలకు వచ్చిన జనాన్ని చూసి మురిసిపోయి...పరవశించి... మళ్లీ పాత పద్ధతికే అలవాటు పడితే దెబ్బతినడం ఖాయం. ప్రత్యర్థులు జగన్ మైండ్ సెట్ అలాగే ఉంటుందని భావించి కొంత వరకూ భరోసాగా ఉన్నారు.

### క్యాడర్ లో ఉత్సాహం...

వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలు, ప్రజల్లోకి వెళ్లడం వల్ల ఆయనలో మరియు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం, ధైర్యం పెరుగుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజా స్పందనను చూసి ఆయనలో పోరాట పటిమ బలపడుతోందని పార్టీ నేతలు అంటున్నారు. అయితే, రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఆయన పర్యటనలను విమర్శిస్తూ, అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకనే ఇలా ప్రజల్లో ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. జగన్ పర్యటనల ద్వారా కిందిస్థాయి నాయకుల్లో, కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నం జరుగుతోంది. పర్యటనలకు వస్తున్న జనసందోహం పార్టీలో నమ్మకాన్ని పెంచుతోందని వైఎస్సార్‌సీపీ అంటోంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా కేవలం బయట పర్యటనలు చేయడంపై అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అయినా సరే.. జగన్ పర్యటనలతో ఇక అధికార పార్టీకి భయపడి ఎవరూ ఇంట్లో దాక్కునే పరిస్థితి లేదు. జెండా అందుకుని వీధుల్లోకి వచ్చే ధైర్యాన్ని మాత్రం జగన్ నింపగలిగారు. మూడు ప్రాంతాల పర్యటనలు శ్రీకాకుళం, తూర్పు గోదావరి, కర్నూలు పర్యటనలతో వైసీపీ ఉత్సాహం రెట్టింపయిందనే చెప్పాలి.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే
# భారీ కుట్ర భగ్నం

- మొదటి పేజి తరువాయి

పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.
షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు..

- మొదటి పేజి తరువాయి

ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

### 148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు. 13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

### వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్‌జీ వ్యక్తులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

### అసెంబ్లీకి రాకుండా పబ్జీలా?

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

# యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది.ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు. ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది.
2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

# అది నేరమా?..

- మొదటి పేజి తరువాయి

ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు.తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించారు.
"మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించాల్సింది పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయారు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో ఏడాది నడుస్తున్నా
మధ్యంతర భృతి (ఐఆర్), పీఆర్సీ హామీలు నెరవేర్చలేదని, ఐదు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. "చంద్రబాబు గారూ.. అధికార అహంకారంతో మీరు వ్యవహరిస్తున్న తీరును, మీ నియంతృత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. చివరకు మీ నీడను చూసి కూడా మీరు సహించలేని స్థాయికి చేరుకున్నారు" అని జగన్ విమర్శించారు.

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే.. జీతంలో 20శాతం కోత

- మొదటి పేజి తరువాయి

ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు.ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు..
# తెలంగాణకు నో ప్లేస్!

- మొదటి పేజి తరువాయి

రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువ ర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది.కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు.మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్‌డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.బీఎల్ సంతోష్
జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు.తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో.. జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

## డిగ్రీ పూర్తి కాగానే క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం

- మొదటి పేజి తరువాయి

సోమవారం ప్రారంభమైన ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో మెగా డీఎస్సీ, స్పోర్ట్స్ కోటాపై జరిగిన చర్చలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని, వారికి టెస్టులు పెట్టాల్సిన అవసరం లేదని, వారి ప్రతిభే కొలమానమని లోకేశ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నది మా ప్రభుత్వ నిర్ణయం. యువత క్రీడలను ఒక ప్రొఫెషన్‌గా తీసుకోవాలి, రిటైర్ అయ్యాక వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ప్రధాని చెబుతున్నారు. కేంద్రం తీసుకొచ్చిన అద్భుతమైన క్రీడా పాలసీని స్వీకరించి, రాష్ట్రంలో మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నాం" అని వివరించారు.గతంలో తమ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా నిలిచిన తీరును లోకేశ్ గుర్తుచేశారు. "బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చింది మా ప్రజా ప్రభుత్వమే. త్వరలోనే ఆమె కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారి కాబోతున్నారు. ఆమెకు భూమి కూడా కేటాయించాం. అదే విధంగా, ఉత్తరాంధ్ర బిడ్డ, ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒలింపిక్ ఆశాకిరణం జ్యోతి యర్రాజి విషయంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి ప్రభుత్వ ఉద్యోగం మంజూరు చేశారు. ఇప్పుడు శ్రీ చరణికి కూడా అదే విధంగా భరోసా ఇస్తున్నాం" అని పేర్కొన్నారు.

### స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు నిరాధారం

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఈ నియామకాల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేశారు. "కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రంలో గతంలో ఉన్న 29 క్రీడాంశాలను 65కి పెంచాం. వాటిలో కూడా ప్రయారిటీ-1, ప్రయారిటీ-2గా విభజించి, మొదట ప్రయారిటీ-1 అభ్యర్థులనే భర్తీ చేశాం. స్పోర్ట్స్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను 'శాప్' (ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ) ఆధ్వర్యంలో సుమారు నెల రోజుల పాటు వివిధ దశల్లో కఠినంగా నిర్వహించాం. మొత్తం ప్రక్రియ పూర్తయి, అభ్యర్థులు శిక్షణ కూడా తీసుకుని ఏడాది గడిచాక ఇప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరం" అని లోకేశ్ అన్నారు."ఏదో కూన రవికుమార్, ఎంపీ భరత్ వంటి వారు లేదా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో ఉన్న నాయకులు సర్టిఫికెట్లు ఇచ్చేశారని, వాటిని ఆమోదించారని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వాటికి ఆధారాలు ఉంటే బయటపెట్టాలి. శాప్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోటా భర్తీని ఎంతో పకడ్బందీగా పూర్తి చేశాం" అని ఆయన సభకు వివరించారు. క్రీడాకారుల భవిష్యత్తుపై ఉన్న అపోహలను తొలగించి, వారికి అన్ని విధాలా అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు.

## నాగబాబుకు కీలక పదవి..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుం ది. జనసేన ఎమ్మెల్సీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబుకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ, ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.
రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని విశేషంగా పెంచడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవుల విస్తరణే లక్ష్యంగా పనిచేసే ఈ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీకి నాగబాబు నేతృత్వం వహించనున్నారు. ఆయన సారథ్యంలో ఈ కమిటీ రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటిస్తూ పర్యావరణ పెంపొందింపు కార్యక్రమాలు, మొక్కలు నాటే భారీ ప్రాజెక్టుల పరిశీలన, పర్యవేక్షణను మరింత వేగవంతం చేయనుంది. పర్యావరణ పరిరక్షణకు మేలు చేకూరేలా కీలక కార్యక్రమాలను రూపొందించడంలో నాగబాబు నేతృత్వంలోని ఈ కమిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.

## మా నడిమిట్లకొస్తే ఒమన్‌పై బాంబేస్తాం

- మొదటి పేజి తరువాయి

కోసం ఇరాన్, ఒమన్‌ల మధ్య జరుగుతున్న చర్చల గురించి మీడియా అడిగిన సందర్భంలో ట్రంప్ ఈ కీలక హెచ్చరిక చేయడం గమనార్హం.

## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం

- మొదటి పేజి తరువాయి

స్థాయిలో ధ్వజమెత్తింది. దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అవకతవకల్లో నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరియైన మార్గమని ఆయన స్పష్టం చేశారు.శాసనమండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. కూటమి ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగులను 'దగా డీఎస్సీ'గా మోసం చేసిందని విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరీక్షలు రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగాల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని విమర్శించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాలపై అధికార పక్షం చేస్తున్న ఆరోపణలనూ ప్రస్తావించారు. నిజంగా గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని భావిస్తే, దానితో పాటు ప్రస్తుత డీఎస్సీ ప్రక్రియపై కూడా ఒకేసారి సీబీఐ విచారణ వేయాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మూడేళ్ల క్రితం నుంచి ఉద్యోగార్థులు ఎదురుచూస్తున్న తరుణంలో, మెరిట్ జాబితా నిర్వహణలో పారదర్శకత లోపించిందని దుయ్యబట్టారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## కార్పొరేషన్ పీజీఆర్ఎస్ లో 15 అర్జీలు-కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 17:**ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదు దారులకు భరోసా కల్పించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. 15 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ కి 9, రెవెన్యూకి ఒకటి, టౌన్ ప్లానింగ్ కి 3, పబ్లిక్ హెల్త్ కి రెండు ఉన్నాయి. ప్రజల ఫిర్యాదులను బాధ్యతతో, క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు. అనంతరం గతంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పురోగతిని విభాగాధిప తులను అడిగి తెలుసు కున్నారు. నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్




పి.వి.రామ లింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంక టరమణ, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్. ఎన్.మూర్తి, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లో 179 అర్జీల స్వీకరణ





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 17:**ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, అర్జీలను నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 179 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ రెవెన్యూ క్లినిక్ కు 71, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 58, హోంశాఖకు 19, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు 6, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు 6, రవాణా, రోడ్లు, భవనాల శాఖకు 3, సామాజిక సంక్షేమం, స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు, పర్యావరణ -- అటవీ -- శాస్త్ర సాంకేతిక శాఖ, మానవ వనరులు (పాఠశాల విద్య)లకు రెండేసి చొప్పున అర్జీలు వచ్చాయి. జలవనరులు, ఇంధన, మహిళలు - శిశువులు --వికలాంగులు -- వయోవృద్ధుల సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, పరిశ్రమలు--వాణిజ్య శాఖలకు ఒక్కొక్కటి చొప్పున, ఇతర విభాగాలకు 3 అర్జీలు అందాయన్నారు.

ప్రత్యేక సారాంశ సవరణ నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరును క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా నిర్ధారించాలని, సంబంధిత ధ్రువపత్రాలను రిఫరెన్స్‌గా భద్రపరచు కోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. అర్హులైన ఓటర్ల వివరాలు పక్కాగా నిర్ధారించడం, అనర్హతలు లేదా అభ్యంతరాలుంటే నిబంధనల ప్రకారం పరిశీలించడం ద్వారా ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లో ఆర్డీవోలు కె. ఆనందరావు, ఆర్. శివకుమార్, సీపీవో ఎల్. అప్పలకొండ, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు ఎం.ఆర్.ఆర్. ప్రేమ్‌కుమార్, పి. భాగ్యలక్ష్మి, డీఎల్‌డీవో పి. వీణాదేవి , డీఎస్పీ ఏ శివ ప్రియ, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం...







**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు17:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పై దృష్టి సారించినట్లు అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు. సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికల నిమిత్తం ఎక్కడ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలి, ప్రస్తుతం ఆ భవనం పనితీరు, అక్కడ మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా, దివ్యాంగులకు వృద్ధులకు ర్యాంపులు ఉన్నాయా లేదా తదితర అంశాల పై కిమ్మూరు, గొంటువానిపాలెం, పులిగోగులపాడు, తిమ్మాపురం, మట్లపాడు మరియు ఎల్లవరం గ్రామ పంచాయతీ లో గుర్తించిన భవనముల యందు ఆయా పోలింగ్ కేంద్రాల వసతుల పై ఎంపీడీవో కుమార్ స్వయంగా పరిశీలించారు. దీనిపై నివేదిక తయారుచేసి పై అధికారులకు పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించాలి



### రైతుల అత్యవసర సమావేశంలో సమస్యపై చర్చ

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** భూపతిపాలెం ప్రాజెక్టుపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు సకాలంలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. గంగవరం మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన భూపతిపాలెం ప్రాజెక్టు రైతుల అత్యవసర సమావేశం నిర్వహించారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంటల సాగు పూర్తిగా ప్రాజెక్టు సాగునీటిపైనే ఆధారపడి ఉందని రైతులు తెలిపారు. ప్రాజెక్టు ఉన్నప్పటికీ సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు మాట్లాడుతూ భూపతిపాలెం ప్రాజెక్టు నుంచి సూరంపాలెం ప్రాజెక్టుకు చేరాల్సిన నీరు సక్రమంగా రావడం లేదన్నారు. నీటి సరఫరాలో ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయి, ఎంత విస్తీర్ణానికి సాగునీరు అందాల్సి ఉంది, ఎంతమంది రైతులు నష్టపోతున్నారనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి రైతులతో నేరుగా చర్చించి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్య పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావు, జిల్లా అధ్యక్షుడు ఈ. సిరిమల్లె రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. కిరణ్, మండల అధ్యక్షుడు తీగల శ్రీనివాస్, లయ కన్వీనర్ యాట్ల సరస్వతి, కో-కన్వీనర్ రాజారెడ్డి, పీసా అధ్యక్ష, కార్యదర్శులు, గిరిజన సంఘం నాయకులు, గిరిజన రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి



కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ూ×=) ప్రక్రియలో క్లెయిమ్స్, అభ్యంతరాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్‌తో కలిసి తహశీల్దార్లు, ఎంపీడీవోలు, అదనపు ఈఆర్ఓలు, అదనపు బీఎల్ఓలతో కలెక్టర్ ఎస్ఐఆర్ ప్రక్రియపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నోటీసుల జారీ నుంచి క్షేత్రస్థాయి విచారణ, ఆధారాల పరిశీలన, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ప్రక్రియలో స్పష్టత, ఏకరూపత ఉండేలా ఈఆర్ఓలు తమ పరిధిలోని ఏఈఆర్ఓలు, బీఎల్ఓలకు విధివిధానాలు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన చోట బీఎల్ఓలు, ఏఈఆర్ఓలకు పునరావృత శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నోటీసుల సకాలంలో పంపిణీ, క్షేత్రస్థాయి ధృవీకరణ, అవసరమైన పత్రాలను బీఎల్ఓ యాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఈఆర్ఓ స్థాయిలో వారానికొకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించి, తీసుకున్న చర్యల నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పనితీరు ఆశించిన స్థాయిలో లేని సిబ్బందిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన మార్గదర్శకాలు, పర్యవేక్షణ అందించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ నోటీసుల దశతో పాటు క్లెయిమ్స్, అభ్యంతరాల విచారణ, పరిష్కార ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, అత్యవసర ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరుకు న్యాయం జరిగేలా, అనర్హమైన నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.




# మారుమూల గ్రామాల సమస్యలకు సత్వర పరిష్కారం

### గ్రీవెన్స్, రెవెన్యూ క్లినిక్‌లో 247 దరఖాస్తులు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ వారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 192 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌కు 55 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులను సంప్రదించేందుకు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు జనరల్ డివిఎస్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ షేక్ షరీఫ్, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్. దాసరి రత్నాకరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి జి.శ్రీరామ్ మూర్తి , జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవదానం, సబ్ డి ఎఫ్ ఓ అనుష, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, డిడిఓ వెంకటనారాయణ, ఐసిడిఎస్ జిల్లా అధికారి కే.ఉమా, జిల్లా మలేరియా అధికారి భాస్కర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, అచ్చుతాచారి, రవికుమార్, రాఘవరావు, పి డి డ్వామా రామ్ ప్రసాద్, జిల్లా ట్రెజరీ అధికారి కుమార్, డిసిహెచ్ఎస్ సాంబశివరావు, పిఏఓ ఎల్.రాంబాబు, డిప్యూటీ తహసిల్దార్లు శ్రీధర్, రవీంద్రబాబు, శివ, శ్రీరామచంద్రమూర్తి, డిఈలు పి. వెంకటరమణ, చైతన్య, శివ, సుబ్బారావు, డిఎస్జీసిసి జయశ్రీ, డిఎం సివిల్ సప్లై రాజేశ్వరి, ఆర్టీవో రాజేష్ కుమార్, సబ్ రిజిస్టర్ ఉపేంద్ర, ఐటీడీఏ ఏవో ఎర్రంశెట్టి రాజు, ఎల్డిఎం ప్రదీప్, జిసిసి డిఎం జయ శ్రీ, తాసిల్దారులు సిహెచ్ బాలాజీ, అమ్మాజీ, సరిత, సిహెచ్ శ్రీనివాసరావు, శివ, కరక సత్యనారాయణ, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.



# త్రాగునీరు కలుషితం పై విచారణ





**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 17 ;** పి. అంకంపాలెం గ్రామంలో పంచాయతీ నీరు కలుషితమై 13 మంది చిన్నారులు అస్వస్థతకు గురికావడంపై జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి యాదగిరి విచారణ చేపట్టారు. సోమవారం సచివాలయం వద్ద రైతులు, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో సీఐ యాదగిరి మాట్లాడుతూ పంచాయతీ నీటిలో కలుషితం కావడానికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో వేరుశనగ పంట వేసే రైతులకు కలుపు మందు ట్రాక్టర్లు ఉన్న రైతులను పిలిపించి వివరాలు సేకరించారు. గ్రామంలో ఉన్న పంచాయతీ నీటి కుళాయి లకు పురుగుమందు అవశేషాలు కలిపే పైపులను జత చేయడం వలన నీరు కలుషితం అయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు. రైతులు కలుపు మందు ట్రాక్టర్లను గ్రామంలోకి తీసుకు రాకుండా పొలాల్లోనే ఉంచాలని ఆదేశించారు. ఒకవేళ గ్రామంలోకి తీసుకువస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలుపు మందు ట్రాక్టర్ లో నీరు పట్టే సమయంలో జరిగిన పొరపాటును సంబంధిత వ్యక్తి ఒప్పుకోవడంతో అతనికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే అస్వస్థతకు గురైన చిన్నారులకు ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది కలగలేదని వారంతా ఆరోగ్యంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. .
పంచాయతీ కార్యదర్శి ఎస్ కృష్ణ మూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పంచాయతీ వాటర్ ట్యాంక్ ను గ్రామంలో ఉన్న అన్ని పైపులను శుభ్రం చేయించామని పేర్కొన్నారు. గత మూడు రోజులుగా వాటర్ శాంపుల్స్ ను జిల్లా కేంద్రానికి పంపించామని ఎటువంటి పురుగుమందు అవశేషాలు లేవని తేలినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేవరకు గ్రామంలో నీటి కొరత లేకుండా రెండు వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం గ్రామములో చిన్నారులకు ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి .క్రాంతి కుమార్, గ్రామస్తులు, రైతులు, ట్రాక్టర్ల యజమానులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


## అంగన్‌వాడీ చిన్నారులకు భోజన కంచాలు, పలకలు వితరణ




**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 17:**నల్లమాడు పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గ్రామానికి చెందిన నాయకుడు గౌతు రామచంద్రరావు (ఎమ్మెల్యే చంద్రరావు) భోజన కంచాలు, పలకలు, గిన్నెలను వితరణ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు వీటిని అందించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త పుల్లేటి సుజాత తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయా పెనుమాక శృతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన క్వాంటమ్ యుఫోరియా వైజ్ఞానిక ప్రదర్శన






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 17:**విద్యార్థుల్లో భవిష్యత్ ఆలోచనా విధానం, పరిశోధనా దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో ది ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన 'క్వాంటమ్ యుఫోరియా' ఎడ్యుఫేయిర్ విజయవంతంగా ముగిసింది. ఈ వైజ్ఞానిక ప్రదర్శన పిల్లలను, తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.
సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, సోషల్ సైన్స్‌తో పాటు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్టప్ ఎకోసిస్టమ్, క్వాంటమ్ ఫిజిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి విభిన్న అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించారు. 11, 12వ తరగతి విద్యార్థులు క్వాంటమ్ ఫిజిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి హాజరైన ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రొఫెసర్లు విద్యార్థుల పరిజ్ఞానాన్ని అభినందించారు. స్టార్టప్ కంపెనీల పనితీరు, వ్యాపార ఆలోచనలు, భవిష్యత్ అవకాశాలను విద్యార్థులు వివరించడం సృజనాత్మకత, వ్యాపార దృక్పథం వెల్లడైంది.
హ్యారీ పాటర్ 25 సంవత్సరాల ప్రస్థానం పై ప్రత్యేక విజువల్ ప్రదర్శన, 'అష్టలక్ష్మి వైభవం', బ్రహ్మోత్సవం సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లే ఆలోచనా విధానాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమే ఎడ్యుఫేర్ లక్ష్యమని సీఈఓ వై. రుద్రశ్రీ మహారాణి, చైర్మన్ వై. విజయకుమారి, డైరెక్టర్లు ఎం. శేషగిరిధర్, డీన్ ఎం. హర్షిణి, వైస్ ప్రిన్సిపాల్ సైరాభాను, శ్రీవల్లి పేర్కొన్నారు.
. 'క్వాంటమ్ యుఫోరియా' విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనా దృక్పథం, భవిష్యత్ సాంకేతికతపై అవగాహన పెంపొందించడమే తమ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

# కృష్ణునిపాలెం లో జాతీయ జెండా ఆవిష్కరణలో పోటోకాల్ ఉల్లంఘన పై కలెక్టర్ కు ఫిర్యాదు

**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 17:--** 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రోటోకాల్ ఉల్లంఘించి సంబంధం లేని వ్యక్తులతో జాతీయ జెండా ఎగరవేయడం పట్ల గ్రామానికి చెందిన కొందరు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి ఐ ఏ ఎస్ కి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. గోకవరం మండలం కృష్ణుని పాలెం గ్రామంలోని ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం గోవిందు మండల పరిషత్ కార్యాలయంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు కారణంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి స్వతంత్ర దినోత్సవ వేడుకలను బాధ్యత అప్పగించి జాతీయ జెండాను ఎగరవేయాలని ఆదేశాలు ఇచ్చారు కాగా ఈ ఆదేశాలను ధిక్కరించి అదే గ్రామానికి చెందిన ఏ విధమైన ప్రోటోకాల్ లేని వ్యక్తితో రాజ్యాంగ విరుద్ధంగా సంబంధంలేని వ్యక్తు లతో జాతీయజెండా ఏవిధంగా ఎగరవేస్తారంటూ ఆసహనం వ్యక్తం చేస్తూ జాతీయజెండా ఆవిష్కరణ లో రాజకీయాలకతీతంగా ప్రోటోకాల్ అనేది కచ్చితం గా పాటించాలని అటువంటి ప్రోటోకాల్ విస్మరించిన పంచాయతీ కార్యదర్శి పై తక్షణం చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక (పీ జీ ఆర్ ఎస్) లో కలెక్టర్ ను కలిసి వివరించి ఫిర్యాదు చేసి నట్లు తెలుస్తుంది. ఇది స్వతంత్ర భారతదేశం కి సంబంధించిన కార్యక్రమం అని రాజకీయ ప్రాధాన్యత మాని అధికారిక ప్రోటోకాల్ ఉన్న వ్యక్తులే జాతీయ జెండాను ఆవిష్కరించడం గౌరవమని అంత గౌరవ మైన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఒక ప్రోటోకాల్ అని అటువంటి ప్రోటోకాల్ విస్మరించడం జాతీయ జెండాకు అవమానంగా భావిస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి దగ్గర ఉండి చేయడం చట్ట ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘన జరిగినట్టే అని భావించి ప్రోటోకాల్ ఉల్లంఘనకు కృష్ణునిపాలెం పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తూ దీనికి సంబంధించి ఈ వీడియో క్లిప్పింగ్స్ తో కలెక్టర్ కి అందించడం జరిగిందని విచారణ జరిపి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారని తెలిపారు.


అర్జీ రశీదు
PGRS - Collectorate
Monday
East Godavari

| | | | |
|---|---|---|---|
| Grievance No | EAG202608177618 | అర్జీ నమోదు తేది | 17-08-2026 |
| అర్జీ విభాగము | Panchayati Raj-->Complaints On Pr Employees And Public Representatives->Complaints On Pr Employees / Public Representatives | | |
| పేరు | GARUGUBILLI DANUNJAYA | ఫోను | 9391906445 |
| జిల్లా | East Godavari | మండలము | Gokavaram |
| సచివాలయము | KRISHNUNIPALEM-(R), 10490613 | ప్రస్తుత నివాసం | -, -, TAMARAPALLI-(R), 10490688, Rampachodavaram, Polavaram |
| పరిష్కరించు అధికారి | Divisional Development Officer,Rajamahendravaram | | |
| గడువు | 90 Day(s) | పరిష్కరించు గడువు తేది | 15-11-2026 |
| ఎన్రోల్మెంట్ ఆపరేటర్ | ఆపరేటర్-8, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, తూర్పు గోదావరి | | |

గమనిక! మీ యొక్క ఫిర్యాదు స్థితి కొరకు 1100 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోను చేసి Grievance No చెప్పగలరు.

## మెడికో ప్రియాంక ఘటన పై శాసన సభలో చర్చ జరపాలి




**మాజీ ఎంపీ మార్గాని భరత్ డిమాండ్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** రాష్ట్ర ప్రభుత్వం తీరును మెడికో ప్రియాంక ఘటన లో బాధిత కుటుబానికి న్యాయం జరుగుతుందనే నమ్మకం రాష్ట్ర ప్రజలకు, బాధిత కుటుబానికి, తమ పార్టీకి లేదని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుపై అసెంబ్లీలో, శాసన మండలిలో చర్చించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లో వైసిపి సిటీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఈ కేసు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రకాశం నగర్ సిఐపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసు లో డి.ఎస్.పి పాత్ర అనుమానాస్పదంగా ఉందని ప్రత్యేకాధికారి పాటిల్ దేవరాజ్ నిష్పక్షపాతంగా జరిపి విచారణ వాస్తవాలు బయట పెట్టాలన్నారు. 3వ తేదీన నిందితుల సెల్ ఫోన్ సిగ్నల్స్ తిలక్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టుగా సమాచారం ఉందన్నారు. ఆ ఏరియాలో తెలుగుదేశం పార్టీ బడాబాబులు నివాసం ఉంటున్నారని నిందితులకు ఆశ్రయం కల్పించింది ఎవరో తెలుస్తోందన్నారు. ఆడపిల్లపై అఘాయి త్యాలకు అదే చివరిరోజు ని చంద్రబాబు ఉదర కొడుతుంటారని, ఈ హత్య జరిగి 10 రోజులైనా విచారణలో పురోగతి లేదని ఎద్దేవా చేశారు. మైనర్ బాలికపై నగర శివార్లలో దారుణంగా అత్యాచారం చేసారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇటువంటి అఘాత్యాలు ఎప్పుడు ఆగుతాయో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

## చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్‌కు ప్రశంసా పత్రం



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 17:**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన చేబ్రోలు పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్సై) మామిడాల సూర్యభగవాన్‌కు ప్రశంసా పత్రం లభించింది. ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
కీలకమైన కేసులను ఛేదించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అందించిన సేవలను గుర్తిస్తూ సూర్యభగవాన్‌కు ఈ అవార్డును అందజేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై సూర్యభగవాన్‌ను పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.ం

## కాగుపాడు హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగష్టు 17:**కాగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, పాఠశాలకు విద్యా సామగ్రిని దాతలు అందజేశారు. కాగుపాడుకు చెందిన స్వర్గీయ సుంకవల్లి గోపాలరావు, గోపెమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రవాసాంధ్రుడు సుంకవల్లి వెంకట కృష్ణారావు, సూర్యలక్ష్మి దంపతులు పాఠశాలకు రూ.లక్ష విరాళంగా అందించారు.
చదువులో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు రూ.50 వేల నగదు ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, పాఠశాలకు ప్రింటర్, కంప్యూటర్ మానిటర్, ఐరన్ ర్యాకులను అందించారు.
నార్త్ సౌత్ ఫౌండేషన్, హైదరాబాద్ వారి సహకారంతో చేబ్రోలు విశాల పరపతి సంఘం చైర్మన్ కడియాల రవిశంకర్, సుంకవల్లి నారాయణరావు, సుంకవల్లి కుమారి చేతుల మీదుగా సోమవారం ఈ సామగ్రిని అందజేశారు.దాతల ఔదార్యాన్ని గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం పాఠశాలకు రూ.లక్ష విరాళంగా అందజేస్తుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కర్రి బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెలిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మార్టేరు లో మానవత శాంతి ర్యాలీ

- ప్రజలకు చేరువలో మానవత సంస్థ సేవలు.
- పర్యావరణ ప్రకృతిపై ప్రజలను మేల్కొల్పే దిశగా ముందుకు అడుగులు వేస్తున్నా మానవత సేవా సంస్థ





**పెనుమంట్ర పెన్ పవర్ ఆగష్టు 17:** పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండల అధ్యక్షుడు పడాల రామచంద్రారెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం వెలగలేరు సొసైటీ సెంటర్ నుండి మార్టేరు సెంటర్ వరకు సంఘమిత్ర స్కూల్, సరస్వతి విద్యానికేతన్, విద్యార్ధి స్కూల్ మరియు వివేకానంద స్కూల్ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రజలు మరియు మానవత సభ్యుల చే శాంతి ర్యాలీ జరిగింది. మానవ సేవే మాధవ సేవ, పర్యావరణ పరి రక్షణ, ప్రకృతి వనరుల కాపాడుకుందాం, ప్లాస్టిక్ వద్దు ప్రకృతి ముద్దు వంటి స్లోగన్స్ చెప్పుకుంటూ, మార్టేరు సెంటర్ కు చేరుకుని మానవ హారం ఏర్పాటుచేశారు. పలువురు మానవత సభ్యుల మానవత సంస్థ ఆశయాలు, ఉత్తమ సమాజ నిర్మాణం విలువలతో కూడిన విద్యా, ఉత్తమ సమాజ నిర్మాణం అనే అంశాలు పట్ల ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో మానవత జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణ మూర్తి, చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, ఆత్మీయ కమిటీ చైర్మన్ చిర్ల శ్రీనివాస్ రెడ్డి, రీజినల్ చైర్మెన్ బాణాల శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ కర్రి కృష్ణా రెడ్డి, కార్యదర్శి చదువుల వెంకట నరేంద్ర, కోశాధికారి అమృతవక్కుల సత్యనారాయణ, డైరెక్టర్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, ఈసీ సభ్యులు పడాల సువర్ణ గౌరీ, చిర్ల వంశీ హరనాథ రెడ్డి, కర్రి అయ్యప్ప రెడ్డి, తెతలి అశోక్ రెడ్డి, కోనాల నర్సిరెడ్డి, రోబ్బి భాస్కర రావు, గుబ్బల శ్రీను మొదలగు వారు పాల్గొన్నారు.


## మాజీ ఎమ్మెల్యే తలారిని పరామర్శించిన వైసిపి నేతలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** ప్రమాదానికి గురై గాయాలతో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజయభారతి చెస్ట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మాజీ శాసన సభ్యులు, కొవ్వూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ తలారి వెంకట్రావును మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని నాని, రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి పరామర్శించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పర్యవేక్షణలో శికిత్స పొందుతున్న తలారి వెంకట్రావు కోలుకుంటు న్నారు. వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పర్యవేక్షణలో వైద్య నిపుణులు డాక్టర్ పెరుమాళ్ళు, డాక్టర్ గౌతమ్ రెడ్డి తలారికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు వివరించారు.

మాజీ ఎమ్మెల్యే తలారి త్వరితగతిన పూర్తి గా కోలుకొని యధావిధిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఆయనను పరామర్శించిన వారిలో మాజీ ఎంపీ, వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ మార్గాన్ని భరత్ రామ్, ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితర నాయకులు ఉన్నారు.

## సూర్యపీఠం ట్రస్టుకు 10,000/ విరాళమిచ్చిన పువ్వల శ్రీదేవి



**గోకవరం పెన్ పవర్ ఆగష్టు:**-సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న సూర్య పీఠం నిర్మాణమునకు కొత్తపల్లి వాస్తవ్యురాలు పువ్వల శ్రీదేవి 10,000/విరాళామందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ ట్రష్టి తోట సాయిబాబా మాట్లాడుతూ సూర్యపీఠం నిర్మాణమునకు ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి యధాశక్తి విరాళాలు అందించడం ఆనందం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్య పీఠం ట్రస్టు సభ్యులు అక్షింతల రాజా, దోసపాటి సుబ్బారావు, కొత్తపల్లి సత్యనారాయణ,పిల్లంగోరు పాపారావు, దేవిశెట్టి చక్రరావు,నంగినీడి రాంబాబు,కొరిపిల్లి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరిని అభినందించిన మాలతీరాణి





**పెన్ పవర్, ఉంగుటూరు ఆగష్టు 17:** భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరిని ఉంగుటూరు నియోజకవర్గ భాజపా కన్వీనర్ శరణాల మాలతీరాణి అభినందించారు. పురంధేశ్వరి నేతృత్వంలో భాజపా మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీకి అంకితభావంతో పనిచేసే సమర్థవంతమైన నాయకులకు భాజపాలో మంచి భవిష్యత్తు ఉంటుందని పురంధేశ్వరికి జాతీయ ఉపాధ్యక్ష పదవి దక్కడం మరోసారి నిరూపించిందన్నారు. ఆమె నాయకత్వంలో పార్టీ మరింత పటిష్టంగా ప్రజల్లోకి వెళ్లి, సంస్థాగతంగా బలోపేతం అవుతుందని మాలతీరాణి పేర్కొన్నారు.

## పదిమందిఉపాధ్యాయులను నియమించేందుకు ప్రతిపాదన

**వి.ఆర్.పురం**
**పెన్.పవర్.ఆగస్టు.17**





మండలం లోనిప్రభుత్వపాఠశాలల్లోవిద్యార్థులకు మెరుగైనవిద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులనునియమించాలని ,ప్రతిపాదించారు. 2026--27 విద్యాసంవత్సరానికి సంబంధించిమొత్తం 10మంది ఉపాధ్యాయులను, నియమించేందుకుప్రతిపాదన రూపొందించారు. ఈప్రతిపాదనలోస్కూల్,అసిస్టెంట్, కునెలకురూ12,500,ఎస్.జి.టి.లకునెలకు పదివేలుగౌరవవేతనంచెల్లించేవిధంగాపేర్కొన్నారు. ఉపాధ్యాయులకొరతఉన్నపాఠశాల ల్లోబోధనాసిబ్బందిని,అందుబాటులోకితీసుకురావడంద్వారావిద్యార్థులచదువుకుఇబ్బం దులులేకుండాచూడాలనే,ఉద్దేశంతోఈప్రతిపాదనచేసినట్లుతెలుస్తోంది. మొత్తం10పోస్టుల్లో 9ఎంపీపీఎస్,పాఠశాలలకు, 1చొప్పున,ఒకపాఠ శాలకుస్కూల్,అసిస్టెంట్,1పోస్టునుప్రతిపాదిం చారు. సంబంధితపాఠశాలలవారీగాపోస్టుల వి వరాలనుకూడాప్రతిపాదనలోతెలియజేశారు. మండలవిద్యాశాఖాధికారి,సిహెచ్,బాబూరావు, ఒకప్రకటనలోతెలిపారు. ఎంపీపీస్,పాఠశాలవివ రాలుక్రిందఇవ్వడంజరిగింది. ఈఅవకాశాన్నిసద్వి నియోగంచేసుకోవాలని,కోరారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో త్వరితగతిన సమస్యలు పరిష్కారం






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 17:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్ నిర్వహించడం జరిగింది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చినారు. నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 27 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడమైనది.




## సవరణ బిల్లుతో పురపాలక వ్యవస్థలో పారదర్శకత: ఎమ్మెల్యే బొలిశెట్టి




**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 17:** పురపాలక సంఘాల్లో ఆస్తుల బదలాయింపు, పన్నుల విధానంలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లును తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభలో స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సోమవారం పురపాలక సవరణ బిల్లుపై చర్చలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ బిల్లు ద్వారా ప్రజలకు మరింత సులభతరమైన, పారదర్శకమైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఆస్తి కొనుగోలు చేసిన వ్యక్తి ఆస్తి మార్పు కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, రిజిస్ట్రేషన్ కు సంబంధిత ఫీజు చెల్లించిన వెంటనే ఆస్తి బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కల్పించడం ప్రభుత్వానికి ఘనతగా ఆయన అభివర్ణించారు. ఇప్పటి వరకు వివిధ పురపాలక సంఘాల్లో వేర్వేరు మ్యూటేషన్ ఛార్జీలు ఉండేవని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ఫీజులు అమలు చేయడం మంచి నిర్ణయమని శ్రీనివాస్ అన్నారు. దీనివల్ల ప్రజలపై అనవసరమైన భారాలు తగ్గడంతో పాటు, విధానంలో ఏకరూపత ఏర్పడుతుందని తెలిపారు. అలాగే గతంలో పన్నుల విధింపులో అధికారుల విచక్షణకు అవకాశం ఉండేదని, దీనివల్ల కొన్ని సందర్భాల్లో అవకతవకలకు ఆస్కారం ఏర్పడే పరిస్థితి ఉండేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్నులు విధించే విధానం తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. ఇకనుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఒకే విధానాన్ని అమలు చేయటం మంచి పరిణామమని అన్నారు. ఆయా పురపాలక సంఘాల ఆర్థిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

## డైమండ్స్ లయన్స్ క్లబ్ కేరిర్ గైడెన్స్ అనేది విద్యార్థులకు, యువతకు తమ ఆసక్తులు, నైపుణ్యాలకు తగిన సరైన కోర్సులు,



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 17.** డైమండ్స్ లయన్స్ క్లబ్ కేరిర్ గైడెన్స్ ప్రోగ్రాం సరైన కెరీర్ గైడెన్స్ అనేది విద్యార్థులకు మరియు యువతకు తమ ఆసక్తులు, నైపుణ్యాలకు తగిన సరైన కోర్సులు, ఉద్యోగ మార్గాలను ఎంచుకోవడానికి సహాయపడుతుందని . ఇది సరైన లక్ష్యాన్ని నిర్దేశించి, భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందడానికి మార్గదర్శకం చేస్తుందని లయన్ శ్రీ పేరి అన్నారు.

స్థానిక గరల్స్ హైస్కులు లో లయన్ ఇంద్ర వాణి ఆధ్వర్యంలో లయన్స్ 316జి జిల్లా గవర్నర్ డాక్టర్ లయన్ దశక సుబ్బారావు పిలుపు మేరకు తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ కేరిర్ గైడెన్స్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి ముఖ్య అతిధి లయన్ శ్రీ పేరి లు మాట్లాడారు భవిష్యత్తును ఎంచుకోవడంలో స్పష్టత కోల్పోతున్న యువతరం. నచ్చిన రంగాన్ని గుర్తించాలని ముఖ్యంగా 10 వతరగతి విద్యార్థుల ఈ విషయం పై అవగాహన పెంచు కోవాలి అన్నారు అధ్యాపకులు రామకృష్ణ అతిధులు కు స్వాగతం పలికారు తెలుగు భాష దినోత్సవం సందర్బంగా విద్యార్థుల కు తెలుగు భాష ఔనత్యం వివరించారు ఈ కార్యక్రమం లోమాధవి. కృష్ణంరాజు. రత్నకుమారి. కారుణ్య. సరస్వతి. లయన్ పళ్ళావజ్జల లలిత లయన్ నాగలక్ష్మి.. లయన్ సుజాత లు పాల్గొన్నారు

## వీసీ డా. ధనుంజయరావుకు "డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత సాఫల్య పురస్కారం".






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 17.** డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావుకు ప్రతిష్ఠాత్మకమైన " డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత సాఫల్య పురస్కారం" లభించింది.

వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధికి, విద్యా--పరిశోధనా రంగాలకు, రైతు సంక్షేమానికి

డా. ధనుంజయరావు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ "వేము సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ" ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సంస్థ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 16 తేదీన తాడేపల్లిగూడెం లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ గాయకులు శ్రీ గజల్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకులు శ్రీ తాతాజీ , కైండ్ నెస్ సొసైటీ అధ్యక్షులు, ప్రముఖ సమాజ సేవకులు శ్రీ గట్టు మాణిక్యాలరావు, శ్రీ వేము వందనం , తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ధనుంజయరావును శాలువాతో ఘనంగా సత్కరించి, పురస్కార పత్రాన్ని అందజేశారు.

ఉద్యాన విద్య, పరిశోధన, రైతు సంక్షేమం, ఉద్యాన రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం వంటి రంగాల్లో డా. ధనుంజయరావు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వక్తలు అభినందించారు.

డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత సాఫల్య పురస్కారం లభించిన సందర్భంగా డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు, బోధనా మరియు బోధనేతర ఉద్యోగులు ఉపకులపతి డా. ధనుంజయరావును అభినందించారు.

ఈ పురస్కారం ఉపకులపతి వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా, డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి కూడా గర్వకారణమని హర్షం వ్యక్తం చేసారు.

### హత్య కేసులోఅనంతబాబు
## బెయిల్ పిటిషన్ మరోసారి తిరస్కరణ

**రాజమహేంద్రవరం పెన్ పవర్ , ఆగస్టు 17:** దళిత డ్రైవర్ హత్య కేసులో ప్రధాన ప్రధాన ముద్దాయి, ఎమ్మెల్సీ అనంతబాబు దాఖలు చేసుకున్న మధ్యస్థ బెయిల్ పిటీషన్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునాయిడ్ అహ్మద్ మౌలానా తిరస్కరిస్తూ సోమవారం ఆదేశాలు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రముఖ న్యాయవాది స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు వాదించారు. నిందితుడు తరపు బెయిల్ ఇమ్మని కోరుతూ చేసిన ముఖ్య వాదనలు ప్రకారం ఆగస్టు 17 నుండి ఏ.పీ. శాసనమండలి సమావే శాలు ప్రారంభం కానున్నాయని, ప్రజాప్రతినిధిగా సభకు హాజరై ప్రజల సమస్యలను వినిపించాల్సిన బాధ్యత తనపై ఉందని ఆయన పేర్కొన్నారు.

తాను గిరిజన ప్రాంతానికి చెందిన వ్యక్తినని, ప్రజాప్రతినిధిగా తన చట్టబద్ధమైన విధులను నిర్వర్తించాల్సి ఉందని కోర్టుకు విన్నవించారు. ఈ కారణాల దృష్ట్యా శాసనమండలి సమావేశాలు ముగిసే వరకు పరిమిత కాలానికి మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కోర్టు ఆదేశించిన విధంగా తగిన పూచీకత్తులు సమర్పించ డానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ప్రాసిక్యూషన్ తరపున బెయిలు ఇవ్వద్దని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు చేసిన వాదనలు వినిపించారు.

పిటిషనర్ ఎస్ సి ఎస్ టి అట్రాసిటీల నిరోధక లాంటి తీవ్రమైన నేరానికి సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడన్నారు.

గతంలో సుప్రీంకోర్టు నుంచి బెయిల్ పొందిన నిందితుడు ప్రాసిక్యూషన్ సాక్షులను తారుమారు చేయడానికి, ప్రలోభపెట్టడానికి ప్రయత్నించి బెయిల్ షరతులను ఉల్లంఘించా డన్నారు . దర్యాప్తులో భాగంగా సాక్షుల నుండి రూ. 4,00,000 నగదు కూడా సీజ్ చేయబడిందన్నారు. బెయిల్ షరతులు ఉల్లంఘించిన కారణంగా, గతంలో అతనికి మంజూరైన బెయిల్ను గత మే 13 న కోర్టు రద్దు చేసిందన్నారు. శాసనమండలి సభ్యుడు అయిన క్రిమినల్ కేసుల విచారణ, జ్యుడీషియల్ కస్టడీ నుండి ప్రత్యేక మినహాయింపులు, రక్షణ ఉండదని ప్రాసిక్యూషన్ స్పష్టం చేసింది.

ఆగస్టు 31, 2026 నాటికి ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాల ప్రక్రియను పూర్తి చేయాలని నవంబర్ 30, 2026 నాటికి మొత్తం కేసు విచారణను పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. ఈ కీలక దశలో నిందితుడికి బెయిల్ ఇస్తే, మిగిలిన సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, పారదర్శకమైన విచారణకు ఆటంకం కలుగుతుందని ప్రాసిక్యూషన్ వాదించింది.

నిందితుడి నేర చరిత్రను అతనిపై 2014లో రౌడీ షీట్ తెరవబడిందని 2019లో మూసివేయబడిందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

# ఏపీ నిట్ లో ఘనంగా రక్తదాన శిబిరం








**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. ఆగస్టు 17:**నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని టాస్క్ ఫోర్స్ క్లబ్, భవిష్య భారత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాంగణంలోని రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు డాక్టర్ రమ్యశృతి, డాక్టర్ స్వాతితో పాటు ఆసుపత్రి సిబ్బంది పలువురు ఆచార్యులు, విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఆచార్యులు, విద్యార్థులు విశేషంగా స్పందించి రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించాలనే సామాజిక బాధ్యతతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 50 మంది నుంచి రక్తదానం చేశారు. టాస్క్ ఫోర్స్ క్లబ్, భవిష్య భారత్ క్లబ్ సమన్వయకర్త, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి ఏర్వ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్. శంకర్ రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి. రవి కిరణ్ శాస్త్రి, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినోత్ కుమార్ రాజా, ఆచార్యులు డాక్టర్ శీనివాసన్, ఎస్. భరణీ దరన్, క్లబ్ కార్యదర్శులు రీతూ సాత్విక (భవిష్య భారత్ క్లబ్), మనోజ్ చీదల్లా (టాస్క్ ఫోర్స్ క్లబ్) తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పథకాల సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆరు పథకాల ద్వారా రైతులకు ప్రభుత్వ రాయితీలు
- కలెక్టర్ దినేష్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** పోలవరం జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల కింద అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో హార్టికల్చర్ సమగ్ర అభివృద్ధి మిషన్ జీడిమామిడి పునరుజ్జీవనం,--ఆయిల్‌పామ--మైక్రో ఇరిగేషన్ తదితర పథకాల ద్వారా రైతులకు ఆర్థిక సహాయం, రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎం ఐ డి హెచ్ కింద అవకాడో, నిమ్మ, మామిడి, జీడిమామిడి, కోకో, కరొండ పంటల విస్తరణకు 112 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించామని, అర్హులైన రైతులకు 40 శాతం వరకు సబ్సిడీ అందుతుందని పేర్కొన్నారు. జీడిమామిడి పునరుజ్జీవనం కింద 250 హెక్టార్లకు 50 శాతం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. ఎన్ ఎం ఈ ఓ--ఆయిల్‌పామ్ కింద 750 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, బోర్‌వెల్లు, పంపుసెట్లు, మొక్కలు, నిర్వహణకు వివిధ రకాల సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆర్కే వివై కింద శాశ్వత పందిరి ఏర్పాటుకు హెక్టారుకు రూ. 2.50 లక్షల వరకు సబ్సిడీతో పాటు హైబ్రిడ్ కూరగాయల విత్తనాలకు రాయితీ ఉంటుందని తెలిపారు. మైక్రో ఇరిగేషన్ పథకం కింద 700 హెక్టార్ల లక్ష్యంతో రైతులకు వారి అర్హతను బట్టి 50 నుంచి 100 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఉన్న పథకాల వివరాల కోసం రైతులు ఉద్యాన శాఖ అధికారులను 79892 09133 నంబర్‌లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటల సాగును విస్తరించి ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు.


## గ్రామసభ అనుమతి లేకుండా చేపట్టిన అక్రమ మైనింగ్ అడ్డుకోవాలి

కలెక్టర్‌కు ఓజుబంధ ఆదివాసీ రైతుల వినతి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ పరిధిలోని ఓజుబంధ గ్రామ సమీపంలోని "భీముడు దిబ్బల కొండ" వద్ద గ్రామసభ అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఆదివాసీ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసిన రైతులు మాట్లాడుతూ, ఇప్పటికే తమ ప్రాంతంలో నిర్వహిస్తున్న క్వారీల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. క్వారీల్లో భారీ పేలుళ్ల కారణంగా ఇళ్లకు బీటలు పడుతున్నాయని, కొండల నుంచి బండరాళ్లు దొర్లి పడటంతో జీడిమామిడి తోటలు, వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా మరో క్వారీని ఏర్పాటు చేయడం వల్ల తమ జీవనోపాధి, మనుగడకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. గ్రామసభ అనుమతి లేకుండా క్వారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమ మైనింగ్ యంత్రాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలను ప్రశ్నించిన ఆదివాసీలను బెదిరిస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపించారు. పీసా నిబంధనలను ఉల్లంఘిస్తూ క్వారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాటర చిన్నకన్నయమ్మ, ఈక పాండుదొర, చోడి కాంతమ్మ, చెదెం మరియమ్మ, పాటర సీతమ్మతో పాటు గ్రామస్తులు, ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

## గోదావరిలో దూకి పంచాయతీరాజ్ ఏఈ కుటుంబం ఆత్మహత్య



- రైఫిల్ షూటింగ్ కోచ్ వేధింపులే కారణమని సూసైడ్ నోట్
- ప్రాణాలతో బయటపడిన మనవడు
- నూకరాజు మృతదేహం లభ్యం
- ఇద్దరు మహిళల మృతదేహాల కోసం గాలింపు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 17:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ లో ఏఈ గా ఉద్యోగం చేస్తున్న నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. కుటుంబంలో కుమారుడు కూతురు భర్త (అల్లుడు) చనిపోవడం తో మనోవేదన మనోవేదంతో జీవిస్తున్న ఆ కుటుంబానికి ఒక వ్యక్తి సహాయం చేస్తూ దగ్గరైన ఒక వ్యక్తి వేధింపులు ,బెదిరింపులు నమ్మకద్రోహం తో విసుగుపోయి లోకం తెలియని మనవుడితో సహా కుటుంబం యావత్తు ఆత్మహత్యకు పాల్పడిన విషాధకర సంఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానిక టూ టౌన్ సి ఐ శివ గణేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడలో నివాసం ఉంటూ పిఠాపురంలో పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా ఉద్యోగం చేస్తున్న నూకరాజుకు భార్య మీనా, కుమారుడు, కుమార్తె సౌజన్య ఉన్నారన్నారు. కుమార్ నాలుగే నాలుగు సంవత్సరాల క్రితం కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోగా, రెండు నెలల క్రితం కుమార్తె భర్త (అల్లుడు) చనిపోయా దన్నారు. నూకరాజు మనవడు కార్తీక్ రైపిల్ షూటింగ్ లో శిక్షణ తీసుకుంటున్నాడు. రైపిల్ శిక్షణ ఇచ్చే కోచ్ షేక్ సాదిక్ హుస్సేన్ ఈ కుటుంబానికి దగ్గరయై ఏ ఈ కూతురు సౌజన్యను నీ కొడుకుని చంపేస్తానని బెదిరింపు లకు, లైంగిక వేధింపులకు పాల్పడడంతో అక్రమ సంబంధానికి ఒడిగట్టడని తెలిసింది. ఈ క్రమంలో సౌజన్య వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, బ్యాంకులో ఉన్న నగదు బలవంతంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంకా డబ్బు, బంగారం తెమ్మని రోజురోజుకు బెదిరింపులు శృతిమించడంతో తల్లి తండ్రికి చెప్పిందన్నారు. దాంతో వారు అతన్ని మందలించి , ఇంటికి రావద్దని మనవడి శిక్షణను మాన్పించి వేశారన్నారు. అయినప్పటికీ వేధింపులు, బెదిరింపులు, కొనసాగిస్తూ సౌజన్య సన్నిహిత ఫోటోలు సోషల్ మీడియాలో పెడతానని పాల్పడ్డాడని తెలిపారు. ఇవన్నీ బయట పెడితే సమాజంలో పరువు పోతుందని భయపడి చివరకు కుటుంబమంతా మనోవేదన గురై ఆత్మహత్య చేసుకోవడం తప్పా వేరే గత్యంతరం లేదని పై వివరాలతో సూసైడ్ లెటర్ రాసినట్లు తెలిపారు. పిఠాపురం నుంచి రాజమండ్రి కి సోమవారం అర్ధరాత్రి కార్లో వచ్చి రైల్ బ్రిడ్జి వద్ద కారు ఆపి మనవడితో సహా భార్య,కుమార్తె ఆయన గోదావరి నదిలో దూకి నట్లుగా సిఐ శివ గణేష్ తెలిపారు. ఈ ఘటనపై రాత్రి సమాచారం రాగా గాలింపు చర్యలు ప్రారంభించామని మత్స్యకారులు గుర్తించి ప్రాణాలతో మనవడు కార్తీక్ ను రక్షించామని ఆస్పత్రిలో చికిత్సకు చేర్పించినట్లు తెలిపారు. మృతదేహాలు కోసం గాలించగా సోమవారం సాయంత్రం నూకరాజు మృతదేహం లభించిందని, ఇద్దరు మహిళల మృత దేహాలు లభించలేదని పోలీసులు, గజ ఈతగాళ్లు, మత్స్యకారులతో గాలిస్తున్నామన్నారు. డ్రైవర్ రాజు కి బస్సులో వెళ్ళమని కొంత డబ్బు ఇచ్చి నూకరాజు పంపించి వేశారని, డ్రైవర్ ని కూడా విచారిస్తున్నామని సి ఐ తెలిపారు. సూసైడ్ లెటర్ వెలుగులోకి రావడంతో ఆదిశ గా కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సూసైడ్ లెటర్‌లో సంచలన ఆరోపణలు..

ఆత్మహత్యకు ముందు నూకరాజు రాసినట్లు భావిస్తున్న లేఖలో షేక్ సాధిక్ ఖాన్ అనే వ్యక్తిపై ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తన కుమార్తెను సాధిక్ ఖాన్ వేధిస్తున్నాడని, ఆ వేధింపుల కారణంగానే తాము ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నామని నూకరాజు లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

సూసైడ్ లెటర్‌లో ప్రస్తావించిన షేక్ సాధిక్ ఖాన్ నిర్వహిస్తున్న రైఫిల్ షూటింగ్ అకాడమీలో నూకరాజు మనవడు షూటింగ్ నేర్చుకుంటున్నట్లు సమాచారం. కుమార్తెను వేధించినట్లు లేఖలో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాల పై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనతో నూకరాజు కుటుంబం, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## అడుగంటుతున్న భూగర్భ జలాలపై దృష్టి పెట్టాలి

కలక్టరేట్ పీజీఆర్ఎస్ లో ' జనతా వారధి బృందం వినతి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** రోజు రోజుకి అడుగంటి పోతున్న భూగర్భ జలాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇంకుడు గుంటల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలని బిజెపి జనతా వారధి బృందం కోరింది. ఈమేరకు జిల్లా కలక్టరేట్ లో సోమవారం పీజీఆర్ఎస్ లో బిజెపి జనతావారధి కో కన్వీనర్ యానాపు ఏసు, స్వామి సూర్య కిరణ్, సిద్దాని వెంకట్, మీనాక్షి రెడ్డి, తనకాల శ్రీనివాసరావు, అత్తిలి పోసేశ్వర రావు, ముద్రగడ సూర్యచంద్ర మోహన్ రావు, పోతురాజు శ్రీనివాసు, వాసంశెట్టి వెంకట్రావు, వంక ఎర్రయ్య, తదితరులు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో భూగర్భ జలాలపై సమగ్ర సర్వే నిర్వహించి, భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోయిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. వర్షపు నీటిని వృథాగా కాలువల్లోకి వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పెద్ద ఎత్తున ఇంకుడుగుంతలు తవ్వించాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అపార్ట్మెంట్లు, కమ్యూనిటీ బిల్డింగ్స్, భారీ భవనాల్లో ఇంకుడుగుంతలను తప్పనిసరి చేయాలని, ముఖ్యంగా కొత్త భవనాలకు అనుమతులు ఇచ్చే సమయంలోనే వర్షపు నీటి సంరక్షణ, రీచార్జ్ వ్యవస్థలు తప్పనిసరి చేయాలని, ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు ప్రభుత్వమే సాంకేతిక, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కొన్ని పంచాయితీల్లో ఇంకుడు గుంతలకు డబ్బు కట్టించుకుంటున్నా , అమలు చేయడం లేదని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు, కాలువలు, వాగులు, ఇతర సహజ నీటి వనరులను పునరుద్ధరించాలి. ఆక్రమణలను తొలగించి వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ పిట్స్ వంటి నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని, అధికంగా భూగర్భ జలాలను వినియోగించే ప్రాంతాల్లో శాస్త్రీయ నియంత్రణ చర్యలు చేపట్టి, రైతులకు మైక్రో ఇరిగేషన్, తక్కువ నీటితో సాగయ్యే పంటలు, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. ఇది ప్రతి పౌరుడి బాధ్యత. అందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా స్వీకరించి, ప్రజలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్మెంట్ సంఘాలు, సామాజిక సంస్థలను ఇందులో భాగస్వాములను చేయాలని కోరారు.

# చుప్పరపాలెం గ్రామ సమస్యలు పరిష్కరించాలి





ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

కలెక్టర్ హామీతో నిరసన విరమణ

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం బోలగొండ పంచాయతీ పరిధిలోని చుప్పరపాలెం గ్రామంలో నెలకొన్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్ రెడ్డి, గ్రామస్తులు మాట్లాడుతూ బోలగొండ నుంచి చుప్పరపాలెం వరకు సరైన రహదారి లేక అత్యవసర సమయాల్లో ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలకు అత్యవసర సమయంలో అంబులెన్స్ సదుపాయం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అనేకసార్లు గ్రీవెన్స్ ద్వారా అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ధర్నా వద్దకు చేరుకుని గ్రామస్తుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. రోడ్డు, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు ధర్నాను తాత్కాలికంగా విరమించారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సాధన విద్యాసాగర్, కే. క్రాంతికుమార్, రాంబాబు, వీరస్వామి, సన్యాసిరెడ్డి, లక్ష్మణరావు, రామకృష్ణతో పాటు చుప్పరపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## మాస్ అల్లా గ్రీన్ స్క్రబ్బర్స్ బాధితులు కలెక్టరేట్ వద్ద ధర్నా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,ఆగస్టు 17:**విజయవాడ కేంద్రంగా మాస్ అల్లా ఎంటర్ప్రైజెస్ పేరుతో గ్రీన్ స్క్రబ్బర్స్ వ్యాపారం చేసి బోర్డ్ తిప్పేసిన జిల్లా డిస్ట్రీ బ్యూటర్ ఇంటి పవన్ కుమార్ ను అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బొమ్మూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.
బాధితులందరూ జిల్లా కలెక్టర్ ను కలిసి సమస్యలను తెలిపారు
ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో వంద మంది వరకు మాస్ అల్లా గ్రీన్ స్కబ్బక్రాస్ ఉన్నారని, ఈ కుంభకోణం నానికి బలెయ్యిపోయారని అన్నారు. కోనసీమ జిల్లా సమితి సభ్యులు ఆనంద్ మాట్లాడుతూ ఆగస్టు 7 న అల్లా ఎంటర్ప్రైజెస్ సంస్థ బోర్డు తిప్పేసిందిని దాంతో ఆ సంస్థనే నమ్ముకున్న నిరుద్యోగులు, మహిళలు మోసపోయారన్నారు. రాజమండ్రి డిస్ట్రిబ్యూటర్
ఇంటి పవన్ కుమార్ జిల్లాలో నిరుద్యోగులు , మహిళలు లక్ష యాభై రెండు లక్షలు పైగా చెల్లించారనీ, అప్పులు చేసుకుని, బంగారం తాకట్టు ఈ గ్రీన్ స్క్రబ్బర్స్లో జాయిన్ అయ్యారన్నారు. ఈ కార్యక్రంలో భాదితులు చంద్రరావు, మణి రత్నం, రాజేష్ లలిత ఓ శాంతి తదితరులు పాల్గొన్నారుద

## పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు నాగబాబుకు కీలక బాధ్యతలు

* హర్షం వ్యక్తం చేసిన గంగవరం జనసేన నాయకులు



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 17:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనమండలి సభ్యుడు కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)కు కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తరణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టే కార్యక్రమాల సమన్వయానికి ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ హరితాభివృద్ధి కార్యక్రమ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడిగా నాగేంద్రరావును ప్రభుత్వం నియమించింది. ఈ పదవికి మంత్రివర్గ స్థాయి హోదాను కూడా కల్పించింది.
రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపు, అడవుల విస్తరణ, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల సంరక్షణ వంటి అంశాలపై చేపట్టే కార్యక్రమాలను సమన్వయం చేయడంలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బాధ్యతలు దోహదపడనున్నాయి.
నాగేంద్రరావుకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడంపై గంగవరం మండల జనసేన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపునకు ఆయన తనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గంగవరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కుంజం సిద్దు, నాయకులు రాజు పవన్, విష్ణు, పావని తదితరులు నాగేంద్రరావుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ సంరక్షణ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలని వారు ఆకాంక్షించారు.

## జగ్గంపాలెం పంచాయతీలో పీసా కమిటీల సమ్మతం నిబంధనల మేరకే క్వారీ ఏర్పాటు

* పోలవరం,కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన జగ్గంపాలెం పిసా కమిటీ సభ్యులు,గ్రామస్తులు

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** పోలవరం జిల్లా గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ ఓజు బంధ గ్రామాలలో నూతన క్వారీ ఏర్పాటు విషయం గురించి జగ్గంపాలెం పంచాయతీ పీసా కమిటీ సభ్యులు స్థానిక గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులు సుమారు వందకు మంది పైగా పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిసా కమిటీ అధ్యక్షులు కోసు మధుబాబు దొర మాట్లాడుతూ మా పంచాయతీలో క్వారీ పిసా కమిటీ, మైనింగ్ చట్టాలకి లోబడి ఏర్పాటు చేయడానికి అంగీకరించామని తమకు ఎటువంటి అభ్యంతరము క్వారీ విషయంలో లేదని కొంతమంది గిరిజన సంఘాల పేరుతో నిర్వాహకుల దగ్గర నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ బెదిరిస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు వివరించడం జరిగిందన్నారు .మెటల్ క్వారీ ఏర్పాటు వల్ల తమ గ్రామాలలో మౌలిక వసతుల అభివృద్ధితోపాటు, స్థానికులకి ఉపాధి లభిస్తుందని చెప్పారు కలెక్టర్ ని కలిసిన వారిలో పీసా కమిటీ సెక్రటరీ కుంజం శ్రీనివాస్ జగ్గంపాలెం మాజీ సర్పంచ్,తుర్రం లీలావతి జగ్గంపాలెం మాజీ ఎంపీటీసీలు కోసు ముసలయ్య, కుంజం సత్యవతి, రంగబాబు దొర పలువురు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు ఉన్నారు

## మధ్యాహ్న భోజన, స్కూల్ శానిటేషన్ కార్మికుల బకాయిలు చెల్లించాలి





* కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా
* వారం రోజుల్లో వేతనాలు జమ చేస్తామని హామీ

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:** మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు, బిల్లులు, స్కూల్ శానిటేషన్ కార్మికులకు ఐదు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సోమవారం పోలవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.
సీఐటీయూ ప్రజా సంఘాల కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన, స్కూల్ శానిటేషన్ కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కంభం శాంతిరాజు మాట్లాడుతూ తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు, బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి అందుతున్న మెనూ చార్జీలు సరిపోవడం లేదని, కార్మికులు అప్పులు చేసి కార్యక్రమాన్ని కొనసాగించాల్సి వస్తోందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని 'స్మార్ట్ కిచెన్' పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.స్కూల్ శానిటేషన్ కార్మికులు పాఠశాలలు, కళాశాలలను పరిశుభ్రంగా ఉంచుతున్నప్పటికీ వారికి నెలకు అందుతున్న రూ.6 వేల వేతనం కూడా సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. జిల్లా విద్యాశాఖాధికారితో పాటు పాడేరు విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, పెండింగ్లో ఉన్న వేతనాలను వారం రోజుల్లోగా కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ధర్నాను విరమించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్కు అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి మడి వెంకట రామలక్ష్మి, యూనియన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, వీరమణితో పాటు పెద్ద సంఖ్యలో మధ్యాహ్న భోజన, స్కూల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## భూపతిపాలెం ప్రాజెక్టు రైతులకు సాగునీరు అందించాలి



**ఎస్టీ కమిషన్ చైర్మన్, కలెక్టర్కు రైతుల వినతి**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 17:**భూపతిపాలెం ప్రాజెక్టుపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు తక్షణమే సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గంగవరం మండలానికి చెందిన పలువురు రైతులు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి, పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్కు వినతిపత్రాలు సమర్పించారు. భూపతిపాలెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ప్రాజెక్టు నీటిపైనే ఆధారపడిన రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని పేర్కొన్నారు. పంటల సాగుకు అవసరమైన నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదలకు సంబంధించి ఉన్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నీటి సరఫరాకు అడ్డంకిగా ఉన్న కారణాలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని రైతులు విజ్ఞప్తి చేశారు. సాగునీరు అందకపోతే పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి భూపతిపాలెం ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు రమేష్ దొర, పోతురాజు వెంకన్న, పీసా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, గంగవరం మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## నెల్లిపూడిలో రైతులకు యూరియా ఎరువుల పంపిణీ



**మండలంలో ఎరువుల కొరత లేదన్న వ్యవసాయ అధికారి**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 17:**గంగవరం మండలంలోని నెల్లిపూడి గ్రామ పరిధిలో రైతులకు యూరియా ఎరువులను పంపిణీ చేశారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు అవసరమైన మేరకు యూరియా అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా మండలంలోని మొకాస రైతులకు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన అనంతరం అవసరమైన ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.ఎరువులు అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు ఆధార్కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ నంబర్ను తీసుకువచ్చి మండలంలోని ఏ విక్రయ కేంద్రం నుంచైనా ఎరువులు పొందవచ్చని వ్యవసాయ అధికారి సూచించారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందుబాటులో ఉన్న నిల్వలను అవసరానికి అనుగుణంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రైతులు నిబంధనల ప్రకారం ఎరువులు పొందాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పాము అర్జున్, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ టి. ప్రభ, మండల భాజపా అధ్యక్షురాలు నీలాలమ్మ, పీసా కార్యదర్శి నాగేష్, కూటమి నాయకులు భాను, అర్జున్, బాబ్జి, కృష్ణ, రాంబాబు, రైతులు, ఉద్యానవన సహాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో స్వీయ మదింపు పరీక్షల పరిశీలన





**వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచన**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 17:**గంగవరం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్వీయ మదింపు పరీక్షల ప్రక్రియను మండల విద్యాశాఖ అధికారి--2 మల్లేశ్వరరావు సోమవారం పరిశీలించారు. పాత రామవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నెల్లిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టేకులవీధి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న స్వీయ మదింపు పరీక్షల తీరును పరిశీలించి, పరీక్షలు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను అంచనా వేసేందుకు స్వీయ మదింపు పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. పరీక్షలు పూర్తయిన అనంతరం విద్యా పరంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. ముఖ్యంగా ఆయా విద్యార్థులకు పునరావృత బోధనా తరగతులు నిర్వహించి, అభ్యసన లోపాలను అధిగమించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ--2 మల్లేశ్వరరావు సూచించారు.
విద్యార్థులందరూ కనీస విద్యా ప్రమాణాలను సాధించేలా పాఠశాలల్లో నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక బోధన కార్యక్రమాలు కొనసాగించాలని ఆయన ఆదేశించారు. అలాగే పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం వంటకాలను ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## బి.జె.పిపార్టీఅధిష్టానం ఆదేశాలమేరకుఎన్నికల పొత్తులు




**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.17**
బి.జె.పిపార్టీఅధిష్టానంఆదేశాలమేరకురాబోవు ఎన్నికలలోపొత్తులుఉంటాయని,,బి.జె.పి.రాష్ట్ర నాయకులుపాయంవెంకయ్యపేర్కొన్నారు. పోలవరంజిల్లాలోమండలాల్లోఎవరితోపొత్తులు పెట్టుకోవాలా?లేదా?బి.జె.పి.రాష్ట్రపార్టీఅధిష్టానం నిర్ణయిస్తుందని,పార్టీఆదేశాలుమేరకు పొత్తులు ఉంటాయని, అందుకుఅనుగుణంగాకార్యకర్తలు అన్నిపంచాయతీలలోఎన్నికలకుసిద్ధంగాఉండాలని,బి.జె.పి.రాష్ట్రనాయకులుపాయంవెంకయ్యకోరారు. బిజెపిపార్టీ ప్రజలక్షేమంకోసం,రాష్ట్రఅభివృద్ధికోసం పాటుపడుతుందని,తెలిపారు.రాబోయేకాలంలో బిజెపిపార్టీబలపడడంద్వారాఈప్రాంతనిర్వాసితులకున్యాయంజరుగుతుందనితెలిపారు.ఈసమావేశంలో మండలఅధ్యక్షులుముత్యాల రాంబాబు,మండల సెక్రెటరీ ఉయిక రత్తయ్య,గిరిజనమోర్చా నాయకులు సోంది నాగేశ్వరావు, సీనియర్,నాయకులుతుర్రంవెంకటనారాయణ, తదితరులుపాల్గొన్నారు.

# ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 17:** జగ్గంపేటలో ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సమితి సభ్యులు అడపా వెంకట్రావు జెండా ఆవిష్కరించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల నాయకులు, సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం నుండి తహసిల్దార్ ఆఫీస్ వరకు కాలి నడకన ర్యాలీ నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జెండా రెపరెపలతో,ఏపీయూడబ్ల్యూజే జిందాబాద్, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు మారుమోగాయి. తహసిల్దార్ జెవిఆర్ రమేష్ కు తమ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందించారు. దశాబ్దాల కాలంగా విలేకరులకు ఇళ్ల స్థలాల పంపిణీ, రిటైర్ అయిన విలేకరులకు పెన్షన్,హెల్త్ స్కీమ్ అమలు, ప్రమాద బీమా సౌకర్యం, విలేకరులపై భౌతిక దాడులు నియంత్రణ వంటి సమస్యల పరిష్కారానికి తహసిల్దార్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గండేపల్లి మండలం జడ్.రాగంపేట ప్రభుత్వ ఆసుపత్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సిహెచ్ సి సూపరిండెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే 70 వార్షికోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఏపీడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు కవి స్వాతి ప్రసాద్ ఆదేశాల మేరకు సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. 70 సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమానికి హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తుంది అన్నారు. సమర్థవంతమైన నాయకత్వం జర్నలిస్టుల యూనియన్ పటిష్టంగా సాగుతుందన్నారు. అందరూ సమిష్టిగా ఉద్యమిస్తే ప్రభుత్వం ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పెనుగాడి సూరిబాబు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి చిక్కాల మణికంఠ, నియోజకవర్గ కార్యదర్శి చింతల రాంబాబు, వెలిది వెంకటరత్నం, నేదూరి శ్రీధర్, రాయుడు సూర్య ప్రకాశ్రావు, కాపవరపు భాస్కరరావు, అలమండ శ్రీనివాసరావు, పాండురంగారావు, గండే నాని, సుంకర శ్రీనివాసరావు, వట్టూరి వీరబాబు, వల్లభ శెట్టి శ్రీనివాస్, ఎల్ శ్రీనివాస్, బొదిరెడ్డి దుర్గారావు, సాంబశివ, మధు, రిషి రామ్, రమ్య, అరుణ తదితర ఏపీయూడబ్ల్యూజే సభ్యులు పాల్గొన్నారు.

# ఏఐ యుగంలో ఇంజినీరింగ్ కెరీర్ అవకాశాలపై అవగాహన





**గండేపల్లి, పెన్ పవర్ (సూరంపాలెం) ఆగస్టు 17:** ఆదిత్య విశ్వవిద్యాలయంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో “ఇంజినీరింగ్ కెరీర్స్ ఇన్ ది ఏఐ ఎరా” అనే అంశంపై నిర్వహించిన గెస్ట్ లెక్చర్ విజ్ఞానదాయకంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మూడవ సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి చెందిన సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి నెక్స్ట్ లెవల్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకులు భీమా శంకర్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై, కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో ఇంజినీరింగ్ రంగంలో అందుబాటులోకి వస్తున్న కొత్త కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.

ప్రస్తుత ఏఐ ఆధారిత పరిశ్రమలో సాంకేతిక, వృత్తిపరమైన, ఏఐ సంబంధిత నైపుణ్యాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించిన ఆయన.. పరిశ్రమ అవసరాలను అందుకోవాలంటే నిరంతర అభ్యాసం, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఏఐ ఆధారిత ఉద్యోగ విపణిలో పోటీని ఎదుర్కొనేందుకు ముందస్తు కెరీర్ ప్రణాళిక, నిరంతర అభ్యాసం కీలకమని పేర్కొన్నారు.

# వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారిని అన్నదానానికి భక్తులు విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 17:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ ఏడువారాల వెంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సోమవారం సందర్భంగా ఆలయ సన్నిధిలో అష్టోత్తర శతనామార్చన, నిత్య కల్యాణ పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.ఇదిలా ఉండగా, ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు తమ వంతుగా విరాళాలు అందజేస్తున్నారు. ఆనందపురానికి చెందిన రేవు శ్రీనివాసు--మంగ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నిత్య అన్నదానానికి రూ.50,000 విరాళాన్ని సమర్పించారు.అలాగే లికడప కు చెందిన ఓబిలి మేధ రాకేష్ రెడ్డి దీప్తి దంపతులువారి కుటుంబ సభ్యులు 50400/- రూపాయలులివిరాళంగా సమర్పించినారు..అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఉపకమిషనర్ నల్ల సూర్యచక్రధర్ రావు చిత్రపటాన్ని వారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎపుగంటి సుబ్బారావు పాల్గొన్నారు

# ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**వైద్య శిబిరాల్లో 500 మందికి పరీక్షలు..**

**యూనియన్ సభ్యుడికి రూ.10 వేల ఆర్థిక సాయం**

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, ఆగస్టు 17:**రాజవొమ్మంగి మండల కేంద్రంలోని మల్లిరెడ్డి గోవింద్ ఫంక్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలవరం జిల్లా ఏపీయూడబ్ల్యూజే నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడకు చెందిన డాక్టర్ అగర్వాల్ కంటి వైద్యశాల, శ్రీరమా దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. అలాగే రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాల్లో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించారు.యూనియన్ సభ్యుడు నీలాద్రి సతీష్‌బాబు ఇటీవల అనారోగ్యానికి గురైన నేపథ్యంలో ఏపీయూడబ్ల్యూజే తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య జర్నలిస్టులు వారధులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.అనంతరం స్థానిక ఏపీయూడబ్ల్యూజే సభ్యులు ప్రజాప్రతినిధులు, అధికారులు, యూనియన్ నాయకులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో పోలవరం జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్, కార్యదర్శి సత్యనారాయణమూర్తి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అడపా వీరబాబు, బాల నారాయణ, పరిటాల వెంకట్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, సీఐ ఎన్. సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకట్రావు, జీసీసీ మేనేజర్ బేబీరాణి, అటవీ అధికారి ఉషారాణి, వైద్యాధికారిణి పావని, మండల అల్లూరి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆరిపాక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలవరం జిల్లాలోని పదకొండు మండలాలకు చెందిన ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## 4వ దశ రీసర్వే డేటా ఎంట్రీని ఈ నెల 20లోగా పూర్తి చేయాలి



- రీసర్వేలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరి
- ప్రజా సంతృప్తి స్థాయిలను మరింత మెరుగుపరచాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 17**: రీసర్వే 4వ దశకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ రెవెన్యూ,సర్వే అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు,రెవెన్యూ, సర్వే అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రీసర్వే, ప్రజా సంతృప్తి స్థాయిలు,ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తదితర అంశాలపై మండలాల వారీగా పురోగతిని సమీక్షించారు.

రీసర్వే ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో,పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, భూములపై వాస్తవ అనుభవదారులకు హక్కులు కల్పించే విధంగా నిష్పక్షపాతంగా రీసర్వే చేపట్టాలని స్పష్టం చేశారు.సర్వే నంబర్లు,ఆధార్ నంబర్ల నమోదులో ఎలాంటి తప్పులు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్,డిసెంబర్,జనవరి నెలలకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కోసం ఇప్పటి నుంచే ఈ-కేవైసీ,బుక్ ఫర్ ప్రింటింగ్ ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలాల వారీగా నిర్దేశించిన గ్రామాల్లో రీసర్వే డేటా ఎంట్రీని వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్లకు స్పష్టమైన గడువులు విధించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 412 గ్రామాలకు గాను 50 గ్రామాల్లో రీసర్వే పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఆర్డీవోలు,సర్వే ఏడీ ప్రత్యేక చొరవ తీసుకుని పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి అవసరమైన అన్ని చర్యలను నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

సిగ్నల్ సౌకర్యం లేని గ్రామాల్లో కూడా రోవర్స్ సహకారంతో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.భూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అనంతరం ఈ-కేవైసీ, బుక్ ప్రింటింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ వన్ రికార్డులను కూడా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో ప్రజా సంతృప్తి స్థాయిలను మరింత మెరుగుపరచాలని, సర్వేయర్లు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొంతమంది సర్వేయర్లు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొంటూ, ఆరోపణలకు తావులేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడం ద్వారా ప్రజా సంతృప్తి స్థాయిలను పెంచాలని, వచ్చే నెల నాటికి సంతృప్తి స్థాయిల్లో గణనీయమైన మెరుగుదల కనిపించాలని ఆదేశించారు.రెవెన్యూ క్లినిక్కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్షిస్తూ నోటీసుల జనరేషన్ పూర్తయిందని, నోటీసుల డెలివరీ ప్రక్రియను రానున్న బుధవారం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన పెండెన్సీని పూర్తిగా పరిష్కరించాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రస్తుతం ఫీల్డ్ వర్క్ మాత్రమే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బుక్ ఏ కాల్, ఎన్‌జీఎస్‌పీ ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, ఎన్నికల సూపరింటెండెంట్ జగన్నాథం, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 4వ దశ రీసర్వే డేటా ఎంట్రీని ఈ నెల 20లోగా పూర్తి చేయాలి



- రీసర్వేలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరి
- ప్రజా సంతృప్తి స్థాయిలను మరింత మెరుగుపరచాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 17:** రీసర్వే 4వ దశకు సంబంధించిన డేటా ఎంట్రీ ప్రక్రియను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ రెవెన్యూ,సర్వే అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు,రెవెన్యూ, సర్వే అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రీసర్వే, ప్రజా సంతృప్తి స్థాయిలు,ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తదితర అంశాలపై మండలాల వారీగా పురోగతిని సమీక్షించారు.

రీసర్వే ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో,పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, భూములపై వాస్తవ అనుభవదారులకు హక్కులు కల్పించే విధంగా నిష్పక్షపాతంగా రీసర్వే చేపట్టాలని స్పష్టం చేశారు.సర్వే నంబర్లు,ఆధార్ నంబర్ల నమోదులో ఎలాంటి తప్పులు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్,డిసెంబర్,జనవరి నెలలకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కోసం ఇప్పటి నుంచే ఈ-కేవైసీ,బుక్ ఫర్ ప్రింటింగ్ ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలాల వారీగా నిర్దేశించిన గ్రామాల్లో రీసర్వే డేటా ఎంట్రీని వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్లకు స్పష్టమైన గడువులు విధించారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 412 గ్రామాలకు గాను 50 గ్రామాల్లో రీసర్వే పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఆర్డీవోలు,సర్వే ఏడీ ప్రత్యేక చొరవ తీసుకుని పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి అవసరమైన అన్ని చర్యలను నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

సిగ్నల్ సౌకర్యం లేని గ్రామాల్లో కూడా రోవర్స్ సహకారంతో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.భూ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అనంతరం ఈ-కేవైసీ, బుక్ ప్రింటింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ వన్ రికార్డులను కూడా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో ప్రజా సంతృప్తి స్థాయిలను మరింత మెరుగుపరచాలని, సర్వేయర్లు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొంతమంది సర్వేయర్లు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొంటూ, ఆరోపణలకు తావులేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడం ద్వారా ప్రజా సంతృప్తి స్థాయిలను పెంచాలని, వచ్చే నెల నాటికి సంతృప్తి స్థాయిల్లో గణనీయమైన మెరుగుదల కనిపించాలని ఆదేశించారు.రెవెన్యూ క్లినిక్కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్షిస్తూ నోటీసుల జనరేషన్ పూర్తయిందని, నోటీసుల డెలివరీ ప్రక్రియను రానున్న బుధవారం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన పెండెన్సీని పూర్తిగా పరిష్కరించాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రస్తుతం ఫీల్డ్ వర్క్ మాత్రమే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బుక్ ఏ కాల్, ఎన్‌జీఎస్‌పీ ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, ఎన్నికల సూపరింటెండెంట్ జగన్నాథం, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com